నమస్తే తెలంగాణ
# సంగారెడ్డి
7 హైదరాబాద్, శనివారం 17 ఫిబ్రవరి 2024 SANGAREDDY



జహీరాబాద్ పట్టణంలో కార్మిక, రైతు, ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ర్యాలీ నిర్వహిస్తున్న కార్మికులు

# కదంతొక్కిన కార్మికులు

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా ఆందోళన

ఉమ్మడి మెదక్ జిల్లా వ్యాప్తంగా ధర్నాలు, రాస్తారోకోలు

ఆటోల బంద్ విజయవంతం

కార్మికుల పొట్ట కొడుతున్న ప్రభుత్వాలు



నర్సాపూర్‌లో సీఐటీయూ ఆధ్వర్యంలో మానవహారం



మెదక్ జిల్లా కేంద్రంలో సమ్మెలో భాగంగా మాట్లాడుతున్న సీఐటీయూ నాయకులు

**సమస్యలు పరిష్కరించాలని కార్మికులు కదం తొక్కారు.** కార్మిక వ్యతిరేక విధానాలపై ఉమ్మడి మెదక్ జిల్లా వ్యాప్తంగా నిరసనలు వెల్లువెత్తాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా ఆయా కార్మిక సంఘాల ఆధ్వర్యంలో శుక్రవారం ధర్నాలు, రాస్తారోకోలు నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడారు. ఢిల్లీలో రైతులు చేస్తున్న శాంతియుత ఆందోళనపై మోదీ ప్రభుత్వం దమనకాండ సరైంది కాదన్నారు. రైతుల న్యాయమైన డిమాండ్లు పరిష్కరించకుండా కేంద్రం నిర్లక్ష్యం చేస్తున్నదని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్రం కార్మిక చట్టాలను వెంటనే రద్దు చేయాలన్నారు. కార్మికులందరికీ కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని రూ.10వేల పింఛన్ అమలు చేయాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఉచిత బస్సు పథకంతో ఆటో కార్మికులు ఉపాధిని కోల్పోయి ఆటో డ్రైవర్లు ఆత్మహత్యలు చేసుకోవాల్సిన దుస్థితి వచ్చిందని ఆందోళన వ్యక్తం చేశారు. మరో వైపు చేసిన అప్పులకు వడ్డీలు కట్టలేక, ఫైనాన్స్ ద్వారా తెచ్చిన ఆటోలకు సకాలంలో ఈఎంఐలు చెల్లించలేక ఆటో డ్రైవర్ల జీవతం దుర్భరంగా మారిందన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం ఆటోడ్రైవర్ల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

- నమస్తే తెలంగాణ నెట్‌వర్క్, ఫిబ్రవరి 16



సిద్దిపేట జిల్లా గజ్వేల్‌లోని అంబేద్కర్ చౌరస్తాలో ధర్నా చేస్తున్న కార్మికులు



# నేడు జననేత బర్త్‌డే

కేసీఆర్ పుట్టినరోజు వేడుకలు ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు

ఉమ్మడి మెదక్ జిల్లా వ్యాప్తంగా సన్నద్ధమైన బీఆర్ఎస్ శ్రేణులు, ప్రజాప్రతినిధులు

సిద్దిపేట, ఫిబ్రవరి 16 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ 70వ పుట్టినరోజు వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించేందుకు సిద్దిపేట, మెదక్, సంగారెడ్డి జిల్లాల్లో ఏర్పాట్లు చేసుకున్నారు. ఆయా నియోజకవర్గ కేంద్రాల్లో జరిగే వేడుకల్లో స్థానిక ఎమ్మెల్యేలు, పార్లమెంట్ సభ్యులు, ఇతర ప్రజాప్రతినిధులు , పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొననున్నారు. ప్రధాన దేవాలయాల్లో ప్రత్యేక పూజలు, రక్తదాన శిబిరాలు, దవాఖానల్లో పండ్ల పంపిణీ తదితర కార్యక్రమాలు చేపట్టనున్నారు. తెలంగాణ సాధించి పదేండ్లలో రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అగ్రభాగాన నిలిపిన నేత కేసీఆర్. తాగు, సాగునీటి రంగాలతో పాటు విద్య, వైద్యం తదితర రంగాల్లో దేశంలోనే నెంబర్‌వన్‌గా తీర్చిదిద్దారు. తన పాలనలో రైతు సంక్షేమానికి పెద్ద పీట వేశారు. నాణ్యమైన విద్యుత్, రైతు బంధు, రైతు బీమా తదితర పథకాలతోపాటు వృద్ధులు, దివ్యాంగులకు ఆసరా పింఛన్‌తో ఆదుకున్నారు. పేదింట కల్యాణలక్ష్మితో ఆ ఇంటిపెద్ద అన్నగా నిలిచారు. అంతటి నాయకుడి పుట్టినరోజు వేడుకలను ఉమ్మడి మెదక్ జిల్లా వ్యాప్తంగా అన్ని గ్రామాలు, పట్టణాల్లో నిర్వహించడానికి సబ్బండ వర్గాలు సిద్ధమయ్యాయి. ఎంత ఎదిగినా అంతే ఒదిగే స్వభావం కలిగిన నేత కేసీఆర్. ఏ స్థాయిలో ఉన్నప్పటికీ తన చిన్ననాటి స్నేహితులతో పాటు, వివిధ వర్గాలకు చెందిన ప్రజలను పేరు పెట్టి పిలిచే తత్వం ఆయనలో ఉంది. ఇలా ప్రతి ఒక్కరినీ ఆత్మీయంగా పలకరించడంతో పాటు వారిని ఆప్యాయంగా దగ్గరకు తీసుకోవడం ఆయనలో ఉన్న ప్రత్యేకత. కొన్నికొన్ని సందర్భాల్లో సమయం చిక్కినప్పుడు మిత్రుల ఇండ్లల్లో జరిగే శుభకార్యాలకు హాజరవుతూ వారితో ఉల్లాసంగా గడుపుతుంటారు. తన స్నేహితులతో కలిసి భోజనం చేయడం ఆనవాయితీగా మార్చుకున్నారు. అన్ని వర్గాలతో మమేకమై ఆప్యాయంగా ప్రేమాభిమానాలు పంచుతూ అందరివాడిగా నిలుస్తున్నారు. ఎమ్మెల్యేగా, ఎంపీగా, కేంద్రమంత్రిగా, తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమానికి నాయకత్వం వహించి రాష్ట్రాన్ని సాధించి పదేండ్లు ముఖ్యమంత్రిగా పని చేసి అన్ని వర్గాల గుండెల్లో నిలిచారు.

## కేసీఆర్‌కు చిన్నతనం నుంచే ఎంతో మేధాశక్తి

కేసీఆర్‌కు చిన్నతనం నుంచే ఎంతో మేధాశక్తి. పాఠశాల స్థాయిలో చిలిపి పనులు చేసిన అతడిలో చురుకుదనం కనిపించేదని కేసీఆర్ గురువులు చెబుతుంటారు. తెలుగు వ్యాకరణం, భాషపై పట్టుసాధించేలా కృషి చేసేవాడు. పదో తరగతి వరకు దుబ్బాక ఉన్నత పాఠశాలలోనే చదువుకున్నారు. విద్యా సంవత్సరం చివరి మూడు, నాలుగు నెలల ముందు ఇక్కడి నుంచి పుల్లూరు హైస్కూల్‌కు వెళ్లి అక్కడే పదో తరగతి పరీక్షలు రాసి ఉత్తీర్ణులయ్యారు. చింతమడక నుంచి రోజూ దుబ్బాక వరకు కాలినడకనే వెళ్లేవారు. తర్వాత కొన్ని రోజులకు చింతమడక గ్రామానికి చెందిన రాఘవరెడ్డి అనే హిందీ పండితుడు ఇదే పాఠశాలలో పని చేసేవాడు. ఆయన దుబ్బాకలోనే నివాసం ఉండటంతో సోదరి సుమతి, కేసీఆర్ కూడా వారి ఇంట్లోనే ఉండే వారు. పాఠశాలలో సాంస్కృతిక ప్రదర్శనల్లో భాగంగా పౌరాణిక నాటకాల్లో కూడా కేసీఆర్ పాత్రలు వేసేవారని అతడి మిత్రులు చెబుతుంటారు. శ్రీ కృష్ణపాండవీయం నాటకంలో పంచ పాండవుల్లో చివరివాడైన సహదేవుడి పాత్రను కేసీఆర్ పోషించాడని చెబుతారు. పాఠశాల విద్యార్థి సంఘం నాయకత్వానికి జరిగిన పోటీలో కూడా ఉపాధ్యక్షుడిగా కేసీఆర్ పని చేశాడు. ఆయన విద్యార్థి దశలో ఒకటో తరగతి నుంచి రెండో తరగతి వరకు అంకంపేట, మూడో తరగతి చింతమడకలో, నాలుగో తరగతి నుంచి పదో తరగతి వరకు దుబ్బాకలో చదువుకున్నారు. అనంతరం సిద్దిపేటలో ఉన్నత విద్య అభ్యసించారు. కేసీఆర్ రైతుబిడ్డ ఎంత ఎదిగినా వ్యవసాయాన్ని మాత్రం ఏనాడూ వదల్లేదు. తొలిసారిగా ఎమ్మెల్యేగా గెలిచి కరువు మంత్రిగా బాధ్యతలు నిర్వహిస్తున్నప్పుడు సైతం చింతమడకలోనే స్వయంగా వ్యవసాయం చేశారు. రోజులో నాలుగైదు గంటల పాటు ట్రాక్టర్‌తో స్వయంగా పొలం దున్నేవారు. ఈ విషయాన్ని ఇప్పటికీ చింతమడక గ్రామస్తులు చెబుతుంటారు. వ్యవసాయమంటే సీఎం కేసీఆర్ ఎంతో మక్కువ. పదేండ్ల తన పాలనలో రైతు సంక్షేమం కోసం అనేక పథకాలను ప్రవేశపెట్టారు. రైతును రాజును చేయాలనే లక్ష్యంగా పని చేశారు. ఎక్కడో ఉన్న కాళేశ్వరం జలాలను తీసుకువచ్చి ఈ ప్రాంత రైతుల సాగునీటి కష్టాలను తీర్చిన నేత కేసీఆర్.భూమికి బరువయ్యేలా రైతులు పంటలు పండించారు. ఇవాళ కేసీఆర్ చేపట్టిన పనుల వల్ల ఉమ్మడి మెదక్ జిల్లాలో ప్రతి గుంట సాగులోకి వచ్చింది.

# నేడు ఎర్రవల్లిలో ఆయుష్య హోమం



ఎర్రవల్లిలో ఆయుష్య హోమానికి జరుగుతున్న ఏర్పాట్లు

మర్కూక్, ఫిబ్రవరి 16: బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ పుట్టినరోజు సందర్భంగా శనివారం ఉదయం మండల పరిధిలోని ఎర్రవల్లిలో ఆయుష్య హోమం నిర్వహించేందుకు నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు. కేసీఆర్ ఆయురారోగ్యాలతో ప్రజాజీవితంలో కొనసాగాలని కోరుతూ చేపట్టే ఈ హోమంలో గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని బీఆర్ఎస్ జిల్లా నాయకుడు కమ్మరి బాల్‌రాజు కోరారు.

# చేర్యాలను రెవెన్యూ డివిజన్ చేయాలి



జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి

చేర్యాల, ఫిబ్రవరి 16: పాత నియోజకవర్గ కేంద్రమైన చేర్యాలను ప్రభుత్వం రెవెన్యూ డివిజన్ చేయాలని జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి డిమాండ్ చేశారు. అసెంబ్లీలో శనివారం బడ్జెట్ సందర్భంగా ఆయన చేర్యాల రెవెన్యూ డివిజన్ అంశాన్ని లేవనెత్తారు. రెండు రోజుల క్రితం చేర్యాల ప్రాంతంలో పాల రైతులు పడుతున్న కష్టాలు, వారి బిల్లుల చెల్లింపులో జరుగుతున్న జాప్యం తదితర అంశాలను అసెంబ్లీలో ప్రస్తావించి సమస్యల పరిష్కారానికి కృషి చేశారు. చేర్యాల ప్రాంతంలో బర్నింగ్ టాపిక్‌గా ఉన్న రెవెన్యూ డివిజన్ అంశాన్ని అసెంబ్లీలో లేవనెత్తడంతో ఈ ప్రాంత ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. చేర్యాలను రెవెన్యూ డివిజన్‌గా ఏర్పాటు చేసేందుకు అన్ని అర్హతలు ఉన్నాయని, డివిజన్‌కు అవసరమైన ప్రభుత్వ కార్యాలయాల సముదాయం రెడీగా ఉన్నదన్నారు. రెవెన్యూ, కోర్టు సమస్యలు ఉంటే సిద్దిపేటకు, పోలీస్, విద్యుత్ సమస్యలుంటే హుస్నాబాద్‌కు, వ్యవసాయం తదితర సమస్యల పరిష్కారానికి గజ్వేల్, నియోజకవర్గానికి సంబంధించి అంశాల కోసం జనగామకు చేర్యాలటౌన్, చేర్యాల రూరల్, కొమురవెల్లి, మద్దూరు, ధూళిమిట్ట మండలాల ప్రజలు వెళ్లాల్సి వస్తున్నదన్నారు. చేర్యాలను రెవెన్యూ డివిజన్ చేస్తే నాలుగు మండలాలతో పాటు చేర్యాల పట్టణ ప్రజలకు ఎంతో వసతి చేకూరుతుందన్నారు. తపాస్‌పల్లి రిజర్వాయర్‌లోకి నీటిని పంపింగ్ చేసి నాలుగు మండలాల్లోని చెరువులు నింపాలని కోరారు. గతంలో ఇదే సమయంలో 105 చెరువులు నింపడంతో రైతులకు ఎంతో లాభం చేకూరిందన్నారు. ప్రస్తుతం తపాస్‌పల్లి, లద్నూరు రిజర్వాయర్లలోకి నీటిని పంపింగ్ చేసి చెరువులు నింపాలన్నారు. ఎమ్మెల్యే లేవనెత్తిన రెవెన్యూ డివిజన్ అంశంపై మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి స్పందిస్తూ చేర్యాల ప్రాంతానికి ఎంతో పేరు ఉందని, ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని చెప్పారు. పోరాటాలకు మారుపేరు చేర్యాలగా అభివర్ణించారు.

# చార్మినార్ జోన్‌లో కలపాలి

మెదక్ జిల్లా నిరుద్యోగులు, యువతకు న్యాయం చేయాలి

హల్దీ వాగులోకి నీటిని వదలాలి

నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి

అసెంబ్లీ జీరో అవర్‌లో ప్రసంగించిన ఎమ్మెల్యే



అసెంబ్లీలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి

నర్సాపూర్, ఫిబ్రవరి16: మెదక్ జిల్లాను సిరిసిల్ల జోన్ నుంచి చార్మినార్ జోన్‌లో కలపాలని నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. శుక్రవారం అసెంబ్లీ సమావేశంలో జీరో అవర్‌లో ఎమ్మెల్యే ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మెదక్ జిల్లాను సిరిసిల్ల జోన్‌లో కలపడం మూలంగా నిరుద్యోగులకు ఉద్యోగాలు రావని, ప్రమోషన్స్ ఉండవని, ఉద్యోగులు అభద్రతా భావంలో ఉన్నారని వెల్లడించారు. మెదక్ జిల్లా హైదరాబాద్‌కి దగ్గరలో ఉందని ఆరోగ్యపరంగా, విద్యాపరంగా ఇక్కడికే వస్తారని అన్నారు. ఎన్నికల సమయంలో సైతం కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ నాయకులు చార్మినార్ జోన్‌లో కలుపుతామని హామీ ఇచ్చారని గుర్తుచేశారు. ప్రజాపాలనలో కూడా మెదక్‌కు చెందిన ఉద్యోగులు, యువకులు అభ్యర్థనలు పంపించారన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకొని నిరుద్యోగులు, ఉద్యోగులకు మేలు జరిగేలా మెదక్ జిల్లాను సిరిసిల్ల జోన్ నుంచి చార్మినార్ జోన్‌కి మార్చాలని కోరారు. అలాగే, హల్దీ వాగుపైన నర్సాపూర్, గజ్వేల్ నియోజవర్గాల్లో అనేక చెక్‌డ్యామ్‌లు ఉన్నప్పటికీ నీళ్లు తగ్గిపోవడంతో ఈ ప్రాంతంలో పంటలు ఎండిపోయే పరిస్థితి ఏర్పడిందన్నారు. మల్లన్నసాగర్ నుంచి కొండపోచమ్మ రిజర్వాయర్‌లో నీళ్లు నింపారని, అక్కడి నుంచి తక్షణమే 0.3 టీఎంసీ నీటిని హల్దీ వాగులోకి వదిలితే 20 నుంచి 30 చెక్‌డ్యామ్‌లు నిండుతాయన్నారు. బీఆర్ఎస్ పాలనలో రైతులను దృష్టిలో పెట్టుకొని నీళ్లు వదలిన విషయాన్ని ఆమె గుర్తుచేశారు. ఇప్పుడు కూడా నీటిని విడుదల చేసి రైతులను ఆదుకోవాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

# పర్యావరణ పరిరక్షణకు పాటుపడుదాం

- నాబార్డు జీఎం పీటీ ఉష
- గీతంలో రెండు రోజుల అంతర్జాతీయ సదస్సు

పటాన్‌చెరు, ఫిబ్రవరి 16: పర్యావరణ పరిరక్షణకు అందరం పాటుపడదామని నాబార్డు జనరల్ మేనేజర్ పీటీ ఉష అన్నారు. శుక్రవారం పటాన్‌చెరు మండలం రుద్రారం గీతం స్కూల్ ఆఫ్ బిజినెస్‌లోని అకౌంటింగ్ విభాగం ఆధ్వర్యంలో పర్యావరణ, సామాజిక, పాలనలో సమకాలీన సమస్యలు (ఈఎస్‌జీ) అనే అంశంపై రెండు రోజుల అంతర్జాతీయ సదస్సును ప్రారంభించారు. సదస్సులో నాబార్డు జనరల్ మేనేజర్ పీటీ ఉష, అరబిందో ఫార్మా సలహాదారు డాక్టర్ జేవీఎన్ రెడ్డి, ఐఎస్‌డీసీ కార్య నిర్వాహక డైరెక్టర్ థెరీసా జాకబ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ ఈఎస్‌జీ సమకాలీన స్వభావాన్ని, స్థిరమైన అభివృద్ధిని సాధించడంలో ప్రపంచవ్యాప్తంగా ఎదుర్కొంటున్న సవాళ్లను ప్రస్తావించారు. గ్రామీణ ప్రాంతాలు, సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల స్వయం సమృద్ధి కోసం నాబార్డు చేపడుతున్న పలు పథకాలను ఆమె వివరించారు. డాక్టర్ జేవీఎన్ రెడ్డి మాట్లాడుతూ ప్రతిఒక్కరూ ప్రకృతి వనరులను విచ్చలవిడిగా వినియోగిస్తున్నారని, ఈ భూమిని కాపాడుకోవడానికి ప్రతి ఒక్కరూ తమవంతు కృషి చేయాలని కోరారు. ప్రతి పౌరుడు తన సామాజిక బాధ్యతలో భాగంగా పర్యావరణహిత కార్యకలాపాలు చేపట్టాలని థెరిసా జాకబ్ పిలుపునిచ్చారు. కార్యక్రమంలో గీతం బీ స్కూల్ ఇన్‌చార్జి డైరెక్టర్ దివ్య కీర్తి గుప్త, డాక్టర్ జీఆర్‌కే ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



గీతంలో ఈఎస్‌జీ అంతర్జాతీయ పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న అతిథులు

# దుబ్బాక సెగ్మెంట్‌లో సాగునీటి సమస్య పరిష్కరించాలి

దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి



దుబ్బాక, ఫిబ్రవరి16: సిద్దిపేట జిల్లా దుబ్బాక నియోజకవర్గంలో సాగునీటి సమస్యను పరిష్కరించాలని ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. పంటలకు సాగునీటి సరఫరాలో ఇబ్బందులు తలెత్తుతున్నాయని, వెంటనే కాల్వల నిర్మాణాలు చేపట్టి రైతుల సమస్య పరిష్కరించాని శుక్రవారం ఆయన అసెంబ్లీ సమావేశాల్లో భాగంగా ఆయన లేవనెత్తారు. దుబ్బాక నియోజకవర్గంలో మల్లన్నసాగర్, కొండపోచమ్మ ప్రాజెక్టుల ద్వారా సాగునీటి సరఫరా జరుగుతున్నదన్నారు. పలు చోట్ల చిన్న కాల్వ ల నిర్మాణాలు పూర్తి కాలేదన్నారు. నియోజకవర్గంలో శంకరంపేట, రామాయంపేట, సంగారెడ్డి, ఉప్పరపల్లి, సిద్దిపేట ప్రధాన కాల్వలు ఉన్నాయని, ప్రధాన కాల్వలకు అనుసంధానంగా తవ్విన చిన్న కాల్వల నిర్మాణాలు పూర్తి చేయలేదన్నారు. నియోజకవర్గంలో ప్రధానంగా చేగుంట, నార్సింగ్ మండలాల్లో నీటి సమస్య తీవ్రంగా ఉందన్నారు. రామాయంపేట, శంకరంపేట, ఉప్పరపల్లి కాల్వ ల ద్వారా నీటి సరఫరా చేయడం లేదని ఆరోపించారు. అటవీశాఖ అధికారులు చిన్న కాల్వలను అడ్డుకోవడంతో సమస్యగా మారిందన్నారు. కేసీఆర్ సర్కారులో నియోజకవర్గంలో సాగునీరు పుష్కలంగా ఉండేదని, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వంలో నీటి సమస్య తీవ్రంగా ఉందన్నారు. ఈ విషయంపై సీఎం, సంబంధిత మంత్రులకు విన్నవించినా ఫలితం లేకుండా పోయిందన్నారు.

# సీఎంఆర్ పూర్తి చేయాలి

గడువులోగా ఎఫ్‌సీఐకి అప్పగించాలి

అలసత్వం వహిస్తే చర్యలు తప్పవు

రైస్ మిల్లర్లకు మెదక్ కలెక్టర్ రాజర్షి షా ఆదేశం

మెదక్, ఫిబ్రవరి 16 (నమస్తే తెలంగాణ): ప్రభుత్వం నిర్దేశించిన గడువులోగా సీఎంఆర్ పూర్తి చేయకపోతే రైస్ మిల్లుల యజమానులపై ఆర్ఆర్ యాక్ట్ కింద స్థిర, చర ఆస్తులను జప్తు చేయడమే కాకుండా క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని మెదక్ కలెక్టర్ రాజర్షి షా హెచ్చరించారు. జిల్లాలో అధికశాతం సీఎంఆర్ పెండింగ్ ఉన్న మిల్లుల యాజమాన్యాలతో శుక్రవారం కలెక్టరేట్‌లోని వీడియో సమావేశ మందిరంలో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎంఆర్ కేటాయించి నెలలు గడుస్తున్నా మిల్లర్లు అలసత్వాన్ని ప్రదర్శిస్తున్నారని, దీనిని తీవ్రంగా పరిగణిస్తామన్నారు. రైతుల నుంచి ప్రభుత్వం కొనుగోలు చేసి సమకూర్చిన ధాన్యాన్ని వేగవంతంగా మిల్లింగ్ చేసి ఈ నెల 29 లోగా భారత ఆహార సంస్థకు చేరవేయాలని రైస్ మిల్లర్లకు సూచించారు. ఈ విషయంలో నిర్లక్ష్యం వహించినా, నిబంధనలను ఉల్లంఘించినా బాధ్యులపై క్రిమినల్ కేసులు నమోదు చేసేందుకు కూడా వెనుకాడబోమని తేల్చిచెప్పారు. సమావేశంలో అదనపు కలెక్టర్ రమేశ్, సివిల్ సప్లయ్ జిల్లా మేనేజర్ హరికృష్ణ, డీసీఎస్ఓ బ్రహ్మారావు, రైస్ మిల్లర్లు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.



మెదక్‌లో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ రాజర్షి షా